క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న స్పెషల్ బ్రాంచి ఏసీపీ



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారిని మంగళవారం తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం పట్టణానికి చెందిన స్పెషల్ బ్రాంచి ఏసీపీ పీవీ గణేష్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు వారిని అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ గోపురం వెండి తాపడానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలోని అంకమ్మ వారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి గుంటూరు ఫిష్ మార్కెట్‌లోని గంగపుత్ర సంఘం వారు రూ.10 వేలు విరాళాన్ని మంగళవారం ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

చిరుధాన్యాలపై అవగాహన



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): సంపూర్ణ పోషక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, గర్భిణులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. రాగులు, పెసలు, సజ్జలు, జొన్నలు, సామలు, వంటి చిరుధాన్యాలు తినటం వలన ఎముకల పుష్టి, గర్భిణుల ఆరోగ్యం, పిల్లల ఎదుగుదల, రక్తహీనత నివారణ, గుండె జబ్బులు, మధుమేహం నివారణ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి మృతికి సంతాపం



పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఉయ్యూరు మండలం కనుమూరు గ్రామానికి చెందిన యలమంచలి సంధ్యారాణి అనారోగ్యంతో మంగళవారం విజయవాడలో మృతి చెందారు. ఆమె 2017 నుంచి ఇక్కడ పనిచేస్తున్నారు. ఆమె భర్త కూడా ఇదే పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమె మృతికి తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మృతదేహానికి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

విద్యార్థినికి సత్కారం



మల్కాపురం(జగ్గయ్యపేట): గ్రామంలోని అంబోజి సింధూజ నీట్ పరీక్షలో మంచి ర్యాంకు పొంది ఎంబీబీఎస్ సీటు సాధించినందుకు మంగళవారం గ్రామస్తులు సర్పంచ్ అంబోజి జాన్ ఆధ్వర్యంలో విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులను అభినందించారు. సింధూజకు శాలువా కప్పి, బొకే ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో స్వర్ణలత, విజయకుమారి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం

తహసీల్దార్ శంకరబాబు

కంచికచర్ల: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో మంగళవారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రీ సర్వే పనులు వేగవంతం చేస్తున్నామని తహసీల్దార్ పబ్బారి శంకరబాబు అన్నారు. మండలంలోని చెవిటికల్లు, మున్నలూరు గ్రామాల్లో రీ సర్వే పనులు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సర్వే పూర్తయిన పరిటాల గ్రామంలో రాళ్లు పాతామని, త్వరలోనే పేరకలపాడు, పెండ్యాల గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్‌కు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకు రైతులు, కౌలు రైతులు సహకరించాలని కోరారు. డెప్యూటీ తహసీల్దార్ ఆఫ్ సర్వేయర్ నంద్రు అనూష్‌కుమార్, డీటీ నాగుల్‌మీరా, వీఆర్వోలు వేముల ప్రదక్షిణరావు రైతులు పాల్గొన్నారు.

సామాన్యుడి చెంతకు ప్రభుత్వ సేవలు

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ఇప్పుడు సాకారం అయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ సచివాలయాల వ్యవస్థ ద్వారా ఆచరణ రూపం దాల్చింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు గతంలో ప్రభుత్వ సేవలు పొందాలంటే మండల కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయవలసి వచ్చేది. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే సేవలు అందుతున్నాయి. సచివాలయాల ద్వారా 542 రకాల సేవలు అందిస్తుండటం విశేషం.

- గ్రామ సచివాలయాల ద్వారా సులభంగా సేవలు
- గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజానీకం



నందిగామ మండలం కేతవీరుని పాడు సచివాలయంలో సేవలు వినియోగించుకుని వెళుతున్న వృద్ధురాలు

- నియోజకవర్గంలో మొత్తం సచివాలయాలు : 75
- నియోజకవర్గంలో సచివాలయ సిబ్బంది సంఖ్య : 647
- నియోజకవర్గంలో వలంటీర్ల సంఖ్య : 1,533
- సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవల సంఖ్య : 542

నందిగామ: నందిగామ నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాలలో మొత్తం 75 సచివాలయాలు ఉన్నాయి. ఆయా సచివాలయాల ద్వారా నిత్యం వందలాదిమంది సేవలు అందుకుంటున్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ రూ.40 లక్షలు వెచ్చించి సచివాలయాలను నిర్మిస్తోంది. ప్రతి సచివాలయం ద్వారా 542 సేవలను ప్రభుత్వం అందజేస్తోంది. మండల కేంద్రాలకు పరుగులు తీయకుండా ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను ప్రభుత్వం సచివాలయాల ద్వారా అందజేస్తోంది.

వారధిలా పనిచేస్తున్న వలంటీర్లు

ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటకు తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. వాళ్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తూ సేవలందిస్తున్నారు. నందిగామ నియోజకవర్గంలో మొత్తం 1,533 మంది వలంటీర్లు సేవలందిస్తున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రతి పథకాన్ని లబ్ధిదారులకు చేరేలా వలంటీర్లు సేవలందిస్తున్నారు. నియోజకవర్గంలో 647 మంది సచివాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఇక అధికారులు సైతం సచివాలయ సేవలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుతున్నాయా లేదా అనే అంశాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటేనే సామాన్యులు భయపడుతూ వెళ్లేవాళ్లు. ప్రస్తుతం సచివాలయాలు ఏర్పాటు చేయడం వలన గ్రామీణ ప్రాంతాలలో వృద్ధులు సైతం నేరుగా సచివాలయాలకు వెళ్లి అవసరమైన ప్రభుత్వ సేవలు పొందుతున్నారు.

సేవలు చెంతకు వచ్చాయి



మా గ్రామం మండల కేంద్రానికి 14 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రానికి వెళ్లవలసి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం గ్రామంలోనే సచివాలయం ఏర్పాటు చేసి దానిద్వారా అన్ని రకాల సేవలను అందిస్తోంది. ఈ నేపథ్యంలో నిత్యం వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యే మాకు సమయం, డబ్బు ఆదా అవుతోంది. నిజంగా చాలా సంతోషంగా ఉంది.

– వి.నాగమల్లేశ్వరరావు, రామిరెడ్డిపల్లి

సేవలు వినియోగించుకోవాలి



ప్రభుత్వ సేవలను ప్రజలకు దగ్గర చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఆ సేవలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుతున్నాయా లేదా అనే అంశాలపై ఎప్పటికప్పుడు కింది స్థాయి అధికారులు, సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతి సేవను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎ.రవీంద్రరావు, ఆర్డీవో నందిగామ

గడపగడపతో ప్రతి గుండెకు చేరువ

జుజ్జూరు గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



జుజ్జూరులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు): గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రతి గుండెకు చేరువవుతున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి గడపకు వెళ్తూ ప్రజల కష్టసుఖాలు, సంక్షేమం తెలుసుకునే వీలు కల్పించారన్నారు. నిరుపేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాశీస్సులు మెండుగా ఉన్నాయని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో ఘన విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, నాయకులు షేక్ జయాలుద్దీన్, రమావత్ రాము, ఫయాజ్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

సభ్యసమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు

- సీఎంను ఇష్టారీతిన దూషిస్తున్న టీడీపీ నేతలు
- సీఐకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకులు



సీఐ హనీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకులు

నందిగామటౌన్: సభ్యసమాజం తలదించుకునేలా నందిగామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకులు బండి మల్లికార్జునరావు, అద్దంకి మణిబాబు అన్నారు. ముఖ్యమంత్రిని అసభ్యంగా దూషించి దుర్భాషలాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ లీగల్ సెల్ నాయకులు సోమవారం రాత్రి సీఐ హనీష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నా మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కనీసం వారిని వారించకపోవటం బాధాకరమన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైకోల్లా, ఉన్మాదుల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శాంతియుతంగా ఉన్న నందిగామలో విద్వేషపూరితంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు టీడీపీ నాయకులు పూనుకుంటున్నారని తెలిపారు. పథకం ప్రకారం రెచ్చగొట్టేలా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు పీవీఎల్ నరసింహారావు, షేక్ సైదా, మంగళపూడి కోటి, సన్నీ, వేల్పుల ప్రభాకర్, విజయభాస్కర్, లక్ష్మీకాంతం, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన



గడపగడపలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షోభాలెన్నున్నా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని రెండవ నంబరు సచివాలయం పరిధిలోని ఐదవ వార్డులో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల పాలనలో సంక్షేమం, లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలలోకి జమ చేస్తున్నారని తెలిపారు. నాలుగున్నరేళ్ల పాలనలో ఎన్ని అడ్డంకులు వచ్చినా ప్రతి నెలా ఒకటవ తేదీన అన్ని రకాల పింఛన్‌లను లబ్ధిదారులకు అందిస్తున్నారని గుర్తు చేశారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. వార్డులలో అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులు సచివాలయంలో తగిన పత్రాలు అందించి పథకాలు పొందాలని సూచించారు. వార్డుల్లోని సమస్యలను కూడా తెలపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వట్టెం మనోహర్, పెంటు శ్రీనివాసరావు, కఠారి హరిబాబు, బొల్లా శ్రీనివాసరావు, గరిక తిరుపతయ్య, కొండ, రామారావు, గంగవరపు కృష్ణకుమారి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 14న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీపై ప్రజా వేదిక జరుగుతుందని ఎంపీడీవో రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ పథకం పీడీ పర్యవేక్షణలో 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక జరుగుతుందన్నారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు సంబంధించిన వివరాలను ప్రజావేదికలో చర్చిస్తారన్నారు. సర్పంచ్‌లు, ఉపాధి హామీ పథకం సిబ్బంది హాజరు కావాలని కోరారు.

పేదల ఆకలి తీర్చేందుకే రాజన్న ఉచిత భోజనం



జగ్గయ్యపేట: ఆకలితో అలమటిస్తున్న నిరుపేదల ఆకలి తీర్చేందుకే రాజన్న ఉచిత భోజనాన్ని ఏర్పాటు చేశామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని కోదాడ రోడ్డులో జరుగుతున్న రాజన్న ఉచిత భోజనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 42 రోజులుగా నిరుపేదలకు ఉచితంగా అన్నదానం చేస్తున్నామన్నారు. అనంతరం పేదలతో కలిసి ఆయన భోజనం చేశారు.నాయకులు శ్రీనివాస్ గౌడ్, రాంబాబు, సీతారామయ్య పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు కెరీర్ అవకాశాలు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న డాక్టర్ మాధవ్ పాండియన్, నెపోలియన్, హరినాథరెడ్డి తదితరులు

మైలవరం: నైపుణ్యం కలిగిన ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు ఉత్తేజకరమైన కెరియర్ అవకాశాలు ఉన్నాయని బెంగళూరు ఎంబెడెడ్ ఐటీటీ ప్రతినిధి డాక్టర్ ఎస్ మాధవ్ పాండియన్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ, టెస్సాల్వ్ సెమీ కండక్టర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎంబెడెడ్ ఐటీటీ, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ అనే అంశంపై వర్క్‌షాపు మంగళవారం నుంచి వారం రోజులు జరుగుతుంది. సదస్సుకు మాధవ్ పాండియన్, వీఎల్ఎస్ఐ టెస్సాల్వ్ సెమీ కండక్టర్ ప్రవేట్ లిమిటెడ్ ప్రతినిధి నెపోలియన్‌లు రిసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరిస్తున్నారు. డాక్టర్ మాధవ్ పాండియన్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల పరిశ్రమల్లో నైపుణ్యం ఉన్న ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్లకు మంచి డిమాండ్ ఉందని, ఎంబెడెడ్ ఐటీటీలో నైపుణ్యం కలిగిన ఎలక్ట్రిక్ ఇంజినీర్లకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరినాథరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు ఎక్కువ డిమాండ్ ఉందని, దీనికి నైపుణ్యం ఉన్న ఇంజినీర్‌లు అవసరమన్నారు. విద్యార్థులు వారం రోజులు జరిగే వర్క్ షాపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ జే శివవరప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమానికి పీ దిపక్‌రెడ్డి, కే లక్ష్మీ లావణ్య కో–ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

కూతురు కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కాలేజీలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సు చేస్తున్న తన కూతురు కనిపించడం లేదని ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, గోపినాథపట్నంకు చెందిన గంటా జయ మంగళవారం నున్న పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గంటా జయ కుమార్తె లావణ్య గుణదలలోని బీసీ హాస్టల్ లో ఉంటూ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కాలేజీలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ మొదటి సంవత్సరం చదువుతోంది. లావణ్య హాస్టల్‌లో ఉండకుండా పాయకాపురం, రాధానగర్లోని ఆమె స్నేహితురాలు చింతల సాయిప్రియ ఇంట్లో ఉంటుందని ఈ నెల 10వ తేదీన సాయిప్రియ జయకు ఫోనులో చెప్పింది. 11వ తేదీన హాస్టల్‌కి వెళ్లిన జయ విచారించగా లావణ్య అక్కడ లేదు. దీంతో తన కూతురు కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

కోడూరులో జగనన్న పాల వెల్లువ రుణ మేళా



కోడూరులో నిర్వహించిన రుణమేళాకు హాజరైన మహిళలు



రెడ్డిగూడెంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ విజయభాస్కరరెడ్డి

జి.కొండూరు: మండలంలోని కోడూరులో జగనన్న పాల వెల్లువ రుణ మేళాను సర్పంచ్ వంగూరు ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమూల్ డెయిరీకి పాలు ఉత్పత్తి చేస్తున్న వారికి అందించే ప్రోత్సాహకాలు, పాల ఉత్పత్తిని పెంచేందుకు చేపడుతున్న చర్యలపై అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం పాడి పశువుల కొనుగోలు నిమిత్తం రుణాల కావాల్సిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామారావు, వెలగలేరు పశు వైద్యాధికారి మురళీకృష్ణారెడ్డి, రూట్ ఇన్‌చార్జి అంజయ్య, వెలుగు ఏపీఎం రాధాకృష్ణ, కేడీసీసీ జి.కొండూరు బ్రాంచి సూపర్‌వైజర్ పణిబాబు, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం రైతు భరోసా కేంద్రంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ పాడి రైతుల ప్రయోజనం కోసం చేపట్టిన సహకార డెయిరీ రంగం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. జగనన్న పాల వెల్లువవల్ల మహిళ పాడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, ఎంపీటీసీ సభ్యుడు కుప్పిరెడ్డి వర ప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్, బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వీనులవిందుగా హరికథా మహోత్సవాలు



మహిసాసురమర్దని కథను గానం చేస్తున్న తిరుపతికి చెందిన షణ్ముఖభాగవతారిణి

విజయవాడ కల్చరల్: హరికథా పితామహుడు ఆదిభట్లనారాయదాసు 159వ జయంతి సందర్భంగా ఆయన శిష్యప్రశిష్యులు సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండపంలో నిర్వహిస్తున్న హరికథా మహోత్సవాలు భక్తిరస ప్రధానంగా సాగుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన హరికథా భాగవతార్‌లు గురుభక్తిని చాటుకుంటున్నారు. మంగళవారం నాటి కార్యక్రమంలో కర్నూలుకు చెందిన పి. రవిప్రసాద్ భక్తమయూరధ్వజ, తిరుపతికి చెందిన షణ్ముఖి భాగవతారాణి మహిసాసుర మర్దని, పి. విజయకుమార భాగవతారిణి సుందరా కాండ, హైదరాబాద్‌కు చెందిన పడాల కల్యాణి వల్లీకల్యాణం కథను గానం చేశారు. కార్యక్రమంలో వాయిద్యకళాకారులు అమ్ముల ప్రసాద్, పాణ్యం దక్షిణామూర్తి, పాలపర్తి ఆంజనేయులు పాల్గొన్నారు. కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. బుధవారం నాటితో హరికథా ఉత్సవాలు ముగుస్తాయని కన్వీనర్ బుర్రా పద్మనాభ శాస్త్రి వివరించారు.

మాదిగ ద్రోహి మంద కృష్ణమాదిగ

ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ వైఎస్ రాజు మాదిగ

జి.కొండూరు: అవినీతి అనకొండ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపునకు మద్దతు తెలిపిన మంద కృష్ణమాదిగ, మాదిగ జాతికే ద్రోహం చేశాడని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ వైఎస్ రాజు మాదిగ మండిపడ్డారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 2014–19 మధ్యకాలంలో మంద కృష్ణమాదిగను రాష్ట్రంలో అడుగు పెట్టనీయలేదని గుర్తు చేశారు. అయినప్పటికీ చంద్రబాబుకు మద్దతు తెలపడం సిగ్గుచేటన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికలలో మాదిగలంతా నోటాకు ఓటు వేయాలని పిలుపునిచ్చిన మంద కృష్ణమాదిగ, ఇప్పుడు అవినీతి చేసి జైలుకుపోయిన చంద్రబాబుకు మద్దతు తెలపడంపై మాదిగలంతా జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఇకనైనా మంద కృష్ణమాదిగ తన తీరును మార్చుకోవాలని, లేదంటే మాదిగ జాతిలో ఆయన చరిత్రహీనుడిగా మిగిలిపోతారని హితవు పలికారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: కవి, పండితుడు సినీ పాటల రచయిత ఆత్రేయ వర్ధంతి సందర్భంగా మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. పద్మశ్రీ ఘంటసాల చైతన్యవేదిక, శ్రీకళాభారతి, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ఈ కార్యక్రమం జరిగింది. గాయనీ గాయకులు మల్లాది స్వాతి, వడ్డాది కామేశ్వరి, షబానా, రాజ్యలక్ష్మి, శ్యాంప్రసాద్ వెంకట్, శ్రీనివాసరావు, జగన్‌మోహనరావు, అబ్రహాం ఆత్రేయ రచించిన సినీ గీతాలను ఆలపించారు. సీనియర్ గాయకుడు డేవిడ్‌రాజు మాట్లాడుతూ తెలుగు సినిమాలలో సాహితీ విలువలను కాపాడుతూ ఆత్రేయ గీతాలను రచించారని తెలిపారు. సీహెచ్ చిట్టిబాబు మాట్లాడుతూ ఆత్రేయను మనసు కవిగా భావిస్తారని తెలిపారు. కార్యక్రమంలో శింగంశెట్టి చంద్రశేఖర్, చీదెళ్ల నాగేశ్వరరావు, గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

తిరువూరులో పట్టపగలు చోరీ

తిరువూరు: తిరువూరు శాంతినగర్లో ఒక నివాసగృహంలో మంగళవారం ఉదయం చోరీ జరిగింది. పెళ్లి శుభలేఖ ఇచ్చే నెపంతో ఇంట్లోకి ప్రవేశించిన ఇరువురు దుండగులు మహిళపై దౌర్జన్యం చేసి బంగారు గొలుసుతో ఉడాయించారు. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల మేరకు బోయపాటి వీరయ్య నివాసంలో ఆయన భార్య ఉమ ఒంటరిగా ఉండటం గమనించిన ఇరువురు యువకులు శుభలేఖ ఇవ్వాలని లోనికి ప్రవేశించారు. హఠాత్తుగా ఉమపై దాడిచేసి బంగారు ఆభరణాలు ఎక్కడున్నాయో చెప్పాలంటూ కొట్టి ఆమె వద్ద ఉన్న మూడు కాసుల బంగారు గొలుసును తస్కరించి ఉడాయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలల హక్కులపై అవగాహన

నందిగామ: డాన్ బోస్కో నవజీవన్ బాల భవన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దవరం సచివాలయంలో మంగళవారం బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కులు, జీవించే, రక్షణ పొందే హక్కు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నాగేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు మెరుగు రత్నం, పలువురు గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యపై కేసు నమోదు

నందిగామ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో నందిగామ పట్టణంలో సోమవారం బంద్ జరుగుతున్న సమయంలో పోలీసు విధులకు ఆటంకం కలిగించినందుకు మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మరికొందరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పండు దొర మంగళవారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఇంటి వద్ద శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన నేపథ్యంలో ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.